క్లుప్తంగా

ఏడు గంగమ్మల కొలువుకు సిద్ధం





గంగమ్మలు కొలువు తీరే ప్రాంతాల్లో విద్యుద్దీపాలంకరణలు

శ్రీకాళహస్తి: దక్షిణ కైలాసం శ్రీకాళహస్తిలో మంగళవారం రాత్రే సత్యస్వరూపిణి గంగమ్మ జాతర సందడి మొదలైంది. ఏడుగంగల ఆలయం వద్ద నుంచి గంగమ్మలు బుధవారం తెల్లవారు జామున ఊరేగింపుగా బయలుదేరి ఆయా ప్రాంతాల్లో కొలువుదీరనున్నారు. పెండ్లిమండపం వద్ద పొన్నాలమ్మ, గాంధీవీధిలో అంకమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరి, బ్రాహ్మణవీధిలో నల్లగంగమ్మ, జయరామరావువీధి కావమ్మ, భేరివారి మండపం వద్ద ముత్యాలమ్మ, సన్నిధివీధిలో అంకాలమ్మను కొలువు తీర్చనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు దర్శన భాగ్యంకల్పిస్తారు. మంగళవారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్‌దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. డీఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈఓ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఈఓ రామారావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలోని స్టోర్‌రూమ్‌ను మంగళవారం ఈవో కేఎస్ రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వలను పరిశీలించారు. రికార్డుల మేరకు సరిగ్గా ఉన్నాయో లేవా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరుకు నిల్వలలో తేడా లేకుండా చూడాలన్నారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

8న హుండీ కానుకల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ కానుకలను ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు ఈవో కేఎస్ రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల కానుకులను ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

ఆలయానికి వీల్‌చైర్ వితరణ



వీల్‌చైర్ అందజేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి హైదరాబాద్‌కు చెందిన ఆకుల రవికాంత్ వీల్‌చైర్‌ను వితరణగా అందజేశారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన ఆయన పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలిసి దాన్ని అందజేశారు. ఆయన దాతకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

అధికారుల సమన్వయంతో ప్రశాంతం



స్వర్ణముఖి నది వద్ద పహారా కాస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పట్టణంలో తుపాన్ మూడు రోజుల పాటు బీభత్సం సృష్టించింది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కాలువలు నిండి నీరు రోడ్లపై ప్రవహించాయి. స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహించింది. వాటిన్నంటినీ అధికారుల సమన్వయంతో ఒక్కరోజులో అధిగమించారు. కమిషనర్ రమేష్‌బాబు కాల్ సెంటర్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించారు. డీఎస్పీ భీమారావు ఆధ్వర్యంలో సీఐలు లోతట్టు ప్రాంతాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పహారా కాశారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం పనిచేస్తూ సరఫరాను పునరుద్ధరించడంలో శ్రమించారు. ఆలయం తరపున ఈఓ రామారావు ఆధ్వర్యంలో అన్నదానంలో భోజనం తయారు చేయించి పునరావాస కేంద్రాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఇరిగేషన్ ఈఈ మదన్‌గోపాల్ ఆధ్వర్యంలో కరకట్టలు దెబ్బతినకుండా, గ్రామాలు మునగకుండా చర్యలు తీసుకున్నారు.



విద్యుత్ మరమ్మతులు

పిచ్చాటూరు : నీట మునిగిన వరి పొలాలు, ఏర్పేడు: చెన్నంపల్లెలో నిత్యావసరాల కోసం వెళ్లేందుకు వేచి ఉన్న గ్రామస్తులు, శ్రీకాళహస్తి : వేదాం మార్గంలో కూలిన భారీ వృక్షం







ముంచెత్తిన మిచాంగ్

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో మిచాంగ్ తుపాన్ బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రంతా భారీ ఈదుర గాలులతో భయభ్రాంతుకు గురిచేసింది. గాలులకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేలకొరగడంతో రాకపోకలు స్తంభించాయి. చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. పలు పంటలు నీట మునిగాయి. పల్లపుప్రాంతవాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

- కూలీన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు
- పొంగి పొర్లుతున్న కాలువలు, చెరువులు
- ప్రమాదపుటంచున పలు చెరువులు
- భారీవర్షానికి దెబ్బతిన్న పంటలు



శ్రీకాళహస్తి : నిండుగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది

బుచ్చినాయుడుకండ్రిగ : తడ- శ్రీకాళహస్తి రోడ్డులో వరదయ్యపాళెం నుంచి శ్రీకాళహస్తి వరకు పలు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేల కూలడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. పలు గ్రామాల్లో తీగలపై చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాగునీటి బోరు మోటార్లు పనిచేయక పోవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 32 చెరువులు చెరువులు నీటితో నిండి కలుజులు పారుతున్నాయి. అరిగిలకండ్రిగ ఎస్టీ కాలనీలోకి వర్షం నీరు రావడంతో అంగన్‌వాడీ కేంద్రంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. భారీ వర్షంతో చెరుకు, మినుము, వరి పంటలు, నారు నీటిమునిగాయి. మండలంలోని సుమారు 120 ఎకరాల్లోని 15 సంవత్సరాలు వయస్సు కలిగిన మామిడి చెట్లు నేల కూలాయి. భారీ వర్షాలకు కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తుంది. నదికి యిరువైపులున్న గ్రామాలు నీటమునిగాయి. నది ఒడ్డున ఏర్పాటు చేసిన వ్యవసాయ బోరు మోటార్లు కొట్టుకుపోయ్యాయి. పలు చెరువులు ప్రమాదపుటంచున ఉండడంతో ముందస్తు జాగ్రత్తగా చెరువు కొనకట్టను తేగొట్టి నీటి వదులుతున్నారు.

నీట మునిగిన పంటలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వేడాం మార్గంలో రోడ్డుపై అడ్డంగా చెట్టు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌తీగలు తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తొట్టంబేడు మండలం పూడి సమీపంలో సొర, గుమ్మడి తదితర పంటలు సుమారు 6 ఎకరాల్లో నీట మునిగాయి.

నాగలాపురం: మండలంలోని బీసీకాలనీ, ఈస్టు దళితవాడ, వేంబాక్కం, కొట్టకాడు, కృష్ణాపురం దళితవాడల్లో వరద నీరు ఇళ్లల్లోకి నీరు చేరింది. ప్రజలు సోమవారం రాత్రంగా నిద్రలేక, కరెంటులేక అవస్థలు పడ్డారు. సర్పంచ్ చిన్నదొరై వెంటనే ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు తెలియజేసి అధికారులతో పునరావాస ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వరద బాధితులను పరామర్శించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పిచ్చాటూరు: ఎడతెరపిలేని వర్షాలకు మండలంలోని ఎస్ఎస్‌బీ పేట, శివగిరి ఏఏడబ్ల్యూ, వేలూరు దళితవాడ, నీరువాయి దళితవాడలు జలమయమయ్యాయి. బంగాళ, ఎస్ఎస్‌బీపేట, శ్రీరామాపురం, వెంగళత్తూరు భూదేరి చెరువు పూర్తి స్థాయిలో నిండడంతో వరి పంట నీట మునిగింది. అద్దాలమేడ. రెప్పాలపట్టు గ్రామాల ఇళ్లలోకి వరద నీరు చేరింది. వరద బాధిత ప్రాంతాలకు చేరుకొని తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం సహాయ చర్యలు చేపట్టారు. శివగిరి ఏఏడబ్ల్యూలో వరద బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారు. గోవర్ధనగిరి, శివగిరి గ్రామాల్లో ట్రాన్స్ ఫార్మర్‌లు నేల వాలాయని, 10 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు ఏఈ రవి తెలిపారు.

జల దిగ్బంధంలో గ్రామాలు

ఏర్పేడు: తుపాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో కాజ్‌వేలు, వాగులు, వంకలు వరద పొంగి పొర్లుతున్నాయి. మంగళవారం పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కొత్త వీరాపురం, గోవిందవరం గ్రామాలకు సమీపంలోని స్వర్ణముఖి నదిపై కాజ్‌వేలు, అంజిమేడు సమీపంలోని బండమానివాగు, గుడిమల్లం సీతకాల్వకు అటవీప్రాంతాల నుంచి చెరువులకు నీటిని అందించే వరవ కాల్వలు నీటితో పొంగి పొర్లుతున్నాయి. ఏర్పేడులో యాదవ వీధి, అశోక్ నగర్, వికృతమాల ఎస్సీ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చెన్నంపల్లి సమీపంలో నక్కల వంకవాగులో నీటి ఉధృతి కారణంగా రాకపోకలు స్తంభించాయి.

కేవీబీపురం అతలాకుతలం

కేవీబీపురం: తుపాన్ వర్షాలకు మండలం అతలాకుతమైంది. కోటమంగాపురం, దిగువపుత్తూరు, పూడి, కోవనూరు గ్రామాల్లో కాజ్‌వేలు కొట్టుకుపోయి. బాహ్య ప్రపంచంతో ఈ గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. పెరిందేశం, కళత్తూరు, రాయపేడు, కోవనూరు గ్రామాల్లో 27 పూరిళ్లు నేలమట్టమయ్యాయి. 91 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం రాత్రి నుంచి మండలంలోని అన్ని గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి. సమస్యలను పునరుద్ధరించేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సుమారు మూడు వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా.







కేవీబీపురం: ఉధృతంగా కాళంగి నది, నాగలాపురం : బాధితులకు ఆహారాన్ని అందిస్తున్న నాయకులు, శ్రీకాళహస్తి : అమ్మపాలెంలో నీటమునిగిన నారుమళ్లు

ఎస్టీలను అన్ని విధాలా ఆదుకుంటాం



ఏర్పేడు: బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ప్రభుత్వ భూముల్లో పక్కా గృహాలు నిర్మిస్తాం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- బాలుడి కుటుంబానికి రూ.4 లక్షల చెక్కు అందజేత

ఏర్పేడు: చిందేపల్లె ఎస్టీ కాలనీ వాసులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎస్టీ కాలనీలో తుపానుతో గుడిసె గోడలు కూలి మృతిచెందిన బాలుడి కుటుంబానికి మంగళవారం ఎమ్మెల్యే రూ.4 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపానుతో శ్రీనివాసులు, కావేరి దంపతుల రెండవ కుమారుడు యశ్వంత్ మృతి చెందడం బాధాకరమన్నారు. సమాచారం అందిన వెంటనే సమస్యను సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి ప్రభుత్వం నుంచి ఒక్క రోజులో రూ.4 లక్షల సాయం మంజూరు చేయించినట్లు వివరించారు. ఎస్టీ కాలనీ చెరువు కలుజుకు సమీపంలో ఉండడంతో పూరి గుడిసెలు కూలిపోతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డుకు అవతలి వైపున ఉన్న ప్రభుత్వ భూముల్లో ఎస్టీలకు పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని పేర్కొన్నారు. కరోనా, తుపాన్ సమయాల్లో పేదలను అన్ని విధాలా ఆదుకునే ముఖ్యమంత్రి జగనన్నేనని చెప్పారు. తుపాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులతో చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే ఎస్టీలకు మధ్యాహ్నం భోజనం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీఓ గిడ్డయ్య, సర్పంచ్‌లు పెంచలయ్య, నారాయణ, మునిరామయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి, చెంచురెడ్డి, సుమన్‌రెడ్డి, దామోధరంరెడ్డి,గాలి గుణశేఖర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంట పద్మానగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధు

రేణిగుంట : మండలంలోని జీపాళెం పంచాయతీ పద్మానగర్లో లోతట్టు ప్రాంతాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పర్యటించి గ్రామస్తులను పరామర్శించారు. గృహాల మధ్య నీరు నిలవకుండా జేసీబీల సాయంతో వికృతమాల చెరువులోకి నీటిని మళ్లించాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షంతో నష్టపోయిన వారి ఇళ్లకు ప్రభుత్వం తరపున నష్టపరిహారం త్వరలోనే అందిస్తారన్నారు. వారిని మూడు పూటల భోజన వసతిని కల్పించారు. ఎవ్వరికి ఏ సమస్య వచ్చినా తనకు నేరుగా ఫోన్ చేయవచ్చని కోరారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, తహసీల్దార్ ఉదయ్ సంతోష్, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ బత్తెమ్మ, శ్రీనివాసులురెడ్డి, వేణు ముదిరాజ్, యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు వేగవంతం చేయండి



నారాయణవనం: తుపాన్ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: తుపాన్ బాధితులను అన్ని విధాల ఆదుకునేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. ట్రాన్స్‌కో, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, సహకారంతో సహాయక చర్యలను మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో చేపడుతున్నారు. త్వరితగతిన సహాయక చర్యలు తీసుకోవాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. మండలంలో 8 విద్యుత్‌స్తంభాలు నేలకూలాయి. పలు గ్రామాలలో ఆదివారం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంగళవారం ఉదయం సరఫరాను పునరుద్ధరించారు. అరుణానది నిండుగా ప్రవహించడంతో తుంబూరు, పాలమంగళం తిరువట్యం గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వర్షాలకు జలమయమైన పాలమంగళం దక్షిణం దళితవాడలో ఎమ్మెల్యే చొరవతో 80 కుటుంబాలకు స్థానికంగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి,భోజన ఏర్పాట్లు చేశారు. కోతకు గురైన తుంబూరు చెరువు కట్టను తహసీల్దార్ ప్రమీల చొరవ తీసుకుని యంత్రాల సహాయంతో పూడ్చి వేసి, గస్తీని ఏర్పాటు చేశారు. గోవిందప్పనాయుడు కండ్రిగలో కొండకాలువలో నీటి ప్రవాహంతో పాడి రైతు దేశయ్యకు చెందిన పశువుల కొట్టం కోతకు గురై కూలిపోవడంతో రెండు ఆవులు మృతి చెందాయి. అరుణానది ఉధృతంగా ప్రవహించడంతో దాటకుండా సముదాయం, నారాయణవనం, తుంబూరు, పాలమంగళం నార్త్‌ల వద్ద రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో పహారా ఏర్పాటు చేశారు. సుమారు 50 ఎకరాల్లో వేరుశనగ, వరి పంటలు వర్షపు నీటిలో మునిగిపోయాయి. పాలమంగళం, తుంబూరు, నారాయణవనం, అరణ్యకండ్రిగ వీవర్స్ కాలనీలలో చేనేత మగ్గం గుంతల్లో నీరు చేరడంతో నేత కార్మికులు ఇబ్బందులు పడ్డారు.



సముదాయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న అరుణానది

పలు కాలనీల్లో పవిత్రారెడ్డి పర్యటన



తొట్టంబేడు: కాలనీలో పర్యటిస్తున్న పవిత్రారెడ్డి



ఊరందూరు చెరువును పరిశీలిస్తున్న ఆకర్ష్‌రెడ్డి


తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే కుమార్తె, వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి మంగళవారం పర్యటించారు. సింగమాల ఎస్టీకాలనీ, రామానాయుడు ఎస్టీ కాలనీ, గుమ్మిడిగుంట ఎస్టీకాలనీ, శాస్త్రి కాలనీ, కారాకొల్లు ఎస్సీ కాలనీ, తదితర కాలనీల్లో పర్యటించిన ఆమె ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు కాలనీ వాసులకు భోజనాలు పంపిణీ చేశారు. ఇళ్లు దెబ్బతిన్న వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, చంద్ర, రమేష్, సురేష్, వెంకటయ్య, సుబ్బారావు, శ్రీరాములురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఊరందూరు చెరువును పరిశీలించిన ఆకర్ష్ రెడ్డి

శ్రీకాళహస్తి మండలం ఊరందూరు చెరువును ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. చెరువు పూర్తిగా నిండిపోయినా ఎగువభాగం నుంచి నీరు ప్రవేశిస్తుండడం తెగే ప్రమాదం ఉండడంతో, ఎస్టీకాలనీ సమీపంలో ఉన్న కలుజు తలుపులను ఏఈ రాఘవేంద్ర హిటాచ్‌ను రప్పించి తొలగింపజేశారు.

జాలువారుతున్న జలపాతాలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి మండలంలోని రామాపురం రిజర్వాయర్ వరకు విస్తరించి ఉన్న కైలాసగిరుల్లో పలు జలపాతాలు ఉధృతంగా జాలువారుతున్నాయి. వేడాం సమీపంలోని వేయిలింగాల కోన జలపాతం కిందికి దుముకుతోంది. దక్షిణకాళికాదేవి ఆలయానికి ఎగువభాగంలో ఉన్న భైరవకోన జలపాతం జోరుగా ప్రవహిస్తోంది. జలపాతాల వద్ద సందర్శకులతో కోలాహలంగా మారింది.



వేయిలింగాల కోన జలపాతం

బాధితులకు సరుకుల పంపిణీ

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ఎస్టీ కాలనీలో మంగళవారం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం నిత్యావసర సరకుల పంపిణీ చేశారు. తుపాన్‌తో కాలనీలోని 35 కుటుంబాలు భోజనానికి ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం అందిన వెంటనే ఎస్టీ కాలనీలోని కుటుంబాలకు 30 రకాల నిత్యావసర సరకులను అందజేసి ఎమ్మెల్సీ మానవత్వాన్ని చాటుకున్నారు. సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, దామోధరం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

శ్రీకాళహస్తి: వరద బాధితులను ఆదుకుంటామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తనయుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 28, 29వ వార్డుల పరిధిలోని బృందావనం కాలనీ, జీకేరెడ్డి కాలనీ, విశాలాక్షినగర్‌లో వర్షంతో ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాలతో వారికి ఆకర్ష్‌రెడ్డి ఆహార పొట్లాలు అందజేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మధురెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆహార పొట్లాలు అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

ఎస్టీ కాలనీల్లో ఆహార పొట్లాల అందజేత

ఏర్పేడు: మండలంలోని పలు ఎస్టీ కాలనీల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు మంగళవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి మధ్యాహ్న భోజనం అందజేశారు. కుక్కలగుంట, గోవిందవరం, చిందేపల్లి ఎస్టీ కాలనీల్లో తుపాను ప్రభావంతో ఎస్టీలు భోజనంలేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి ఎమ్మెల్యే భోజనాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయముని, మధు యాదవ్, వెంకటేష్. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పేడు: సరుకులను అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

స్వర్ణముఖి వద్ద సెల్ఫీల సందడి



శ్రీకాళహస్తి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖి నది పరవళ్లు తొక్కుతోంది.పట్టణ ప్రజలు, సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున్న స్వర్ణముఖి నది వద్దకు చేరుకుని ప్రవాహాన్ని తిలకిస్తున్నారు. పరవళ్లు తొక్కుతున్న సుందర దృశ్యాన్ని సెల్ఫీలుగా తమ ఫోన్‌లో బంధించుకుంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఏటా నది పారుతోంది. స్వర్ణముఖి ప్రవహించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన వర్షం.. తగ్గని వరద ఉధృతి







వరదయ్యపాళెం: మారేడు కాలువ వద్ద సహాయక చర్యలు, ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద పాండూరు చెరువు కలుజు, వరదయ్యపాళెంలో ఇళ్లను చుట్టుముట్టిన వరదనీరు

వరదయ్యపాళెం: నాలుగు రోజులుగా కుదిపేసిన వర్షం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి తగ్గుముఖం పట్టింది. వరదనీటి ఉధృతి మాత్రం తగ్గలేదు. వాగులు, వంకలు, కాజ్‌వేలపై వరద నీటి ఉధృతి యథావిధిగా కొనసాగింది. పలు మార్గాల్లో రాకపోకలు స్తంభించాయి. సత్యవేడు డిపో నుంచి మంగళవారం రోజంతా వాహన రాకపోకలు ఆగిపోయాయి. సత్యవేడు నుంచి ఊత్తుకోట మీదుగా తిరుపతికి వెళ్లే మార్గంలో రాజులకండ్రిగ వద్ద కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. అలాగే సత్యవేడు నుంచి వరదయ్యపాళెం మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లాల్సిన మార్గంలో కదూరు వద్ద సున్నపు కాలువ ఉధృతంగా ప్రవహించడం, వరదయ్యపాళెంలోని గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. వరదయ్యపాళెం వద్ద ఎస్ఐ నాగార్జునరెడ్డి, పోలీస్ సిబ్బంది ప్రత్యేక చొరవతో కదూరు కూడలి వద్ద, గోవర్ధనపురం వద్ద అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రజానీకాన్ని ట్రాక్టర్ల ద్వారా అవతలివైపుకు దాటించారు. కొందరిని కాలినడకన పోలీస్ సిబ్బంది సహకారంతో దాటించారు. సాయంత్రం భారీ వాహనాలు మాత్రమే ఈ మార్గంలో వంతెనల వద్ద రాకపోకలకు అనుమతించారు. వరదయ్యపాళెం మండల కేంద్రం జలమయమైంది. గోవర్ధనపురంలోని మారేడు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గం నుంచి బస్టాండ్ వరకు జలమయమైంది. మండలవ్యాప్తంగా 110 కరెంటు స్తంభాలు నేలకులాయి. వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించి 10 ట్రాన్స్‌ఫార్మర్లు వరదనీటిలో కొట్టుకుపోయాయి. దీంతో దీంతో రూ. 20లక్షల మేరకు విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రానికి చిన్న పాండూరు, వరదయ్యపాళెం, సంతవేలూరు, బత్తలవల్లం గ్రామాల్లో మాత్రం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అధికారులు వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం వివరాలను అంచనా వేస్తున్నారు.